క్లుప్తంగా

రథయాత్ర విజయవంతం చేయండి

బోథ్: ప్రజా సమస్యల పరిష్కారం, బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యాధికార చైతన్యం కోసం సాగుతున్న లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్ర ఆదిలాబాద్ జిల్లాలో కొనసాగుతుందని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకుల, ధర్మ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి అన్నెల లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం బోథ్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల రాజకీయ చైతన్యం కోసమే విశారదన్ మహరాజ్ లక్ష కిలోమీటర్ల రథయాత్ర చేస్తున్నారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో నెలరోజులపాటుగా రథయాత్ర సాగుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్, శ్రీనివాస్, జేఏసీ నాయకులు భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

చెట్టు తొలగింపు

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం సమీపంలో రోడ్డు పక్కన భారీ చెట్టు మొదలు భాగానికి మంటలు అంటుకోవడంతో కాలిపోయింది. కాండం పూర్తిగా కాలిపోవడంతో చెట్టు ప్రమాదకరంగా మారింది. గమనించిన పొచ్చెర గ్రామానికి చెందిన నవీన్ రెడ్డి విద్యుత్ ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. స్పందించిన అధికారులు జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు.

ముగిసిన శివపురాణం



శివపురాణం బోధిస్తున్న భీమశంకర్ మహరాజ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గంగారెడ్డి నగర్‌లో గత వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న శివపురాణం శుక్రవారం ముగిసింది. ముగింపు సందర్భంగా భీమాశంకర్ మహరాజ్ మట్లాడారు. వారం రోజుల్లో కొనసాగిన శివపురాణంలో పాల్గొన్న భక్తులు శివపురాణంలో చెప్పిన వాటిలో కొన్నింటినైన ఆచరించాలన్నారు. భక్తులు ఆచరించినప్పుడే ఇలాంటి కార్యక్రమాలకు సార్థకత ఉంటుదన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే




సర్వే చేస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల తుది సర్వే కొనసాగుతోంది. శుక్రవారం మండల కేంద్రంతో పాటు, గేర్జం, చించోలి, జున్ని గ్రామాల్లో తుది జాబితా సర్వేను ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించి ఇందిరమ్మ కమిటీ సభ్యులతో జాబితా రూపొందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరడిగొండ: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీవో రాజవీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తర్నం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు ఉన్నారు.

‘బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం’



గ్రామస్తులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి: బీఆర్‌ఎస్ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని జామిడి గ్రామంలో శుక్రవారం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ తన అనుచరులతో బోథ్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి 200 మందిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని భవనాన్ని సైతం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అమలుకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు తిరుమల్ గౌడ్, కేదారశ్వేర్ రెడ్డి, వినోద్ రెడ్డి, రమణ, రజనీకాంత్ రెడ్డి, రఘు, నాగారెడ్డి, అభిరాం రెడ్డి, మొట్టె కిరణ్, ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

నల్లమట్టితో అధిక దిగుబడి

- పొలాల్లో చెరువు మట్టి వేసుకుంటున్న రైతులు
- సారవంతంగా మారనున్న భూమి



చేలలో వేసుకున్న చెరువు మట్టి

సిరికొండ: పంట దిగుబడి పెరగాలంటే పంట పొలంలో నాణ్యమైన ఎరువులు, రసాయనాలు చల్లుతూ.. పంట సాగు చేస్తున్నారు. పెరిగిన ఎరువుల ధరలతో అటు పంటలకు అధికంగా ఎరువులు వాడకంతో పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. దీంతో సేంద్రియ ఎరువుల వాడకంతో పాటు రైతన్నలు పంట పొలంలో చెరువు పూడిక మట్టిని వేస్తే భూమి సారవంతంతో పాటు దిగుబడి పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతన్నలు వేసవిలో చెరువులో లభించే పూడిక మట్టిని రైతులు తమ పొలంలో వేసుకుంటున్నారు.

వేసవిలో అనుకూలం..

వ్యవసాయ భూముల్లో చెరువులోని సారవంతమైన పూడిక మట్టిని వేసుకోవడం కోసం వేసవికాలం లో చెరువులు ఎండిపోవడంతో పూర్తిగా నల్లమట్టి లభిస్తుంది. పూడిక తీసేందుకు అనుకూలమైన సమయంలో అలాగే చేలలో ఎలాంటి పంట ఉండదు కాబట్టి పూడిక మట్టిని వ్యవసాయ భూముల్లో వేసుకుంటారు.

రసాయనిక ఎరువులతో నష్టాలు..

ఇసుక నేలలు, బంజారు భూముల్లో రసాయనిక ఎరువుల వేసి పంటలు పండిచినా.. దిగుబడి అంతంతే వస్తుంది. అయిన పంట దిగుబడి కోసం అనేక రసాయనిక ఎరువుల వాడకంలో ఖర్చు అధికం అవుతుంది. దీంతో రైతన్నలు అప్పులు చేసి మరీ పంటలు సాగు చేస్తున్నారు. ఇసుక భూములను సారవంతంగా మార్చేందుకు గ్రామాల్లో ఉన్న చెరువుల్లో పూడిక మట్టిని తమ పంట పొలంలో వేసుకుని దిగుబడిని పెంచుకునే అవకాశం ఉంది. దీంతో రైతన్నలు వేసవికాలం వచ్చిందంటే చెరువుల్లో పూడిక మట్టిని పొలంలో వేసుకుంటున్నారు.

చెరువు మట్టి వేశాను



ఎకరం పంట పొలంలో చెరువు మట్టిని వేశాను. పంట దిగుబడి కోసం అనేక రసాయనిక ఎరువుల వాడకం వలన అధిక ఖర్చు అవుతుంది. ఖర్చులు పెరిగి, దిగుబడి తగ్గుతుంది. దీంతో పొలంను సారవంతంగా చేయడం కోసం నల్లమట్టి వేశాను.

– కాల్వ లస్మన్న, రైతు, సిరికొండ

దిగుబడి పెరిగింది



నేను 4 ఎకరాల్లో గత రెండు సంవత్సరాల క్రితం చెరువు పూడిక మట్టి వేశాను. ఇసుక నేలల్లో పంట దిగుబడి అంతగా వచ్చేది కాదు. దీంతో మట్టి వేశాక పొలం సారవంతంగా మారి దిగుబడి పెరిగింది.

– ఘర్షకుర్తి సురేశ్, రైతు, సిరికొండ

అనేక ప్రయోజనాలు..

- చెరువు మట్టిని పొలాల్లో వేయడం వలన ఆమ్ల, క్షార గుణాలతో భూమి బలంగా మారుతుంది.
- నేలల్లో లవణాల గాఢత తగ్గుతుంది. సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయి పెరుగుతుంది. ముఖ్యంగా నత్రజని స్థాయి పెరుగుతాయి.
- చెరువుల పూడిక మట్టిని వ్యవసాయ భూముల్లో వేయడం వలన రసాయనిక ఎరువుల వాడకం కొంత మేరకు తగ్గుతుంది.
- మొక్కలు ఆరోగ్యంగా, ఎత్తుగా పెరిగి, అధిక దిగుబడి వస్తుంది.

రోడ్డుపైనే జొన్న కుప్పలు



తాంసి మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డు సమీపంలో రోడ్డుపైనే జొన్న కుప్పలు పోశారు. యార్డులో స్థలం సరిపోక రోడ్డుకు ఇరువైపులా పోశారు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సబ్ మార్కెట్‌యార్డులో సరిపడా స్థలం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. – తాంసి

పశువులకు టీకాలు వేయించాలి



టీకా వేస్తున్న పశువైద్యాధికారి

నేరడిగొండ: పాడి రైతులు పశువులకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. శుక్రవారం మండలంలోని దర్బ, దర్బ తండా గ్రామాల్లో ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. నెలరోజుల పాటు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇచ్చోడ: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం మండలంలోని జున్ని గ్రామంలో పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలంలో పశువులకు గాలికుంటు సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి

తలమడుగు: ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తుందని మండల ప్రత్యేకాధికాఖర మార్కెటింగ్ శాఖ ఏడీ గజానంద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బహిరంగ ప్రజావాణి నిర్వహించారు. గ్యాస్, విద్యుత్, పీఎం కిసాన్, రుణమాఫీ వంటి సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. డోర్లీ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజన మహిళకు గత 17 సంవత్సరాల క్రితం ప్రభుత్వం భూపంపిణీ కింద ఎకరం సగం భూమికి సంబంధించిన పట్టా పాసుబుక్ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు భూమిని చూపించలేదన్నారు. వెంటనే స్పందించిన అధికారులు ఉన్నత అధికార దృష్టికి తీసుకెళ్లి సర్వే చేయించి భూమిని ఇచ్చే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అతక్కలపేల్లి సురేశ్ తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి మహారాష్ట్ర బ్యాంకులో వ్యవసాయ రుణం ఉండగా.. మాఫీ కాలేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, వ్యవసాయాధికారి ప్రమోద్ రెడ్డి, ఎంపీవో వినోద్ కుమార్, ఏపీవో మేఘమాల, ఈసీ ప్రవీణ్ రావు, పంచాయతీ కార్యదర్శి అనిల్ రెడ్డి, అశోక్, గజానన్, స్వామి పాల్గొన్నారు.

రౌడీలు సత్ప్రవర్తనతో మెలగాలి

నేరడిగొండ: రౌడీలు సత్ప్రవర్తనతో మెలగాలని, మితిమీరిన రౌడీయిజం, వసూలు, బెదిరింపులకు పాల్పడితే చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ భీమేష్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజిక సంఘాల పేరుతో దొపిడీకి యత్నిస్తున్న జాదవ్ గోపాల్ (టైగర్ గ్రూప్ అధ్యక్షుడి)పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రౌడీలు, సామాజిక సంఘాల నాయకులు దోపిడీలకు యత్నించినా, వసూళ్లు, బెదిరింపులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. పశువులు తరలిస్తున్న వాహనం ఆపి బెదిరింపులకు పాల్పడిన జాదవ్ గోపాల్‌పై నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. సామాజిక సేవ, సంఘాల పేరుతో ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు, వసూళ్లకు పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉగ్రవాద దాడులకు నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మైనార్టీలు



నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

ఉట్నూర్‌రూరల్: కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులకు నిరసనగా ఉట్నూర్ పట్టణ కేంద్రంలో జామ మసీద్ కమిటీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. భారతీయ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమం ఇబ్రాహీం, కలీం మౌలానా, జాహెద్, యూసూఫ్ పాల్గొన్నారు.

బోథ్: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడికి నిరసనగా శుక్రవారం సొనాల మండల కేంద్రంలోని ముస్లిలు జామ మసీదు ప్రాంగణంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులకు ప్రభుత్వం సరైన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు.

కోర్టు విధులు బహిష్కరణ

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసన దాడిని బోథ్ బార్ అసోసియేషన్ సభ్యులు ఖండించారు. శుక్రవారం బోథ్ జూనియర్ సివిల్ కోర్టు ఆ వరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్ రావ్ దేశ్‌పాండే, న్యాయవాదులు మోహన్ రావ్, ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్ కుమార్, ధమ్మపాల్ గైక్వాడ్, ఠాకూర్ రూపేందర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జోగు రామన్న, నాయకులు

ఆదిలాబాద్: పర్యాటకులపై జమ్మూకశ్మీర్ పహల్గంలో ఉగ్రవాదులు చేసిన దాడి హేయమైన చర్య అని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం ప్రాంగణంలో శుక్రవారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పహల్గాం మృతులకు శ్రద్ధాంజలి నిర్వహించారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతి స్వామితో కలిసి మాజీ మంత్రి మృతుల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నాయకులు చిట్యాల సుహాసిని రెడ్డి, ప్రమోద్ కుమార్ ఖత్రి, గేడం మాధవ్, కందుల రవీందర్, మాదస్తు సంతోష్, యూనిస్ అక్బానీ పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

బోథ్: సొనాల మండల కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ 134వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

సిరికొండ: మండల కేంద్రంలో ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో సిరికొండ ఆర్‌ఎంపీల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వాహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాలో తహసీల్దార్ తుకారం పాల్గొని మాట్లాడారు. జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సలహాలు, సూచనలు చేశారు. వివిధ కోర్సుల్లో 18 సంవత్సరాలు నిండిన యువతకు శిక్షణతో కూడిన ఉద్యోగం కల్పనలో భాగంగా జాబ్‌మేళా నిర్వహించారు. మొదటి బ్యాచ్‌లో 36 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు ఫౌండేషన్ మేనేజర్ గీతా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు కౌశిక్, సత్యవర్దన్, బావురావు, ప్రకాశ్‌రావు, మహేందర్, ఆర్‌ఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కం మల్లేష్, ఓం ప్రకాశ్, భోజారెడ్డి, జైస్వాల్ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ఇచ్చోడ: మండలంలో శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాలలో ఎంపీడీవో లక్ష్మణ్ సందర్శించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శించి వసతులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పరిశీలనలో భాగంగా మాన్కపూర్, నర్సాపూర్ పాఠశాలలను సందర్శించి వసతులను పరిశీలించినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న వసతులపై జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

నీలుగాయి మృతి

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం సమీపంలో ప్రధాన రహదారి పక్కన నీలుగాయి మృతి చెందింది. ఉదయం 5.30ల సమీపంలో వాకింగ్ కోసం వెళ్తున్న పలువురికి రోడ్డు పక్కన నీలుగాయి పడిపోయి కనిపించింది. దగ్గరికి వెళ్లి చూడగా నీలుగాయి మృతి చెంది ఉంది. ఎవరైనా దాడి చేశారా? లేక ఏదైనా వాహనం ఢీకొట్టిందా అనే విషయం తెలియ రాలేదు. ఫారెస్ట్ అధికారులు మృతిచెందిన నీలుగాయిని పరిశీలించారు.

సన్మానం

కైలాస్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషాను సీపీఐ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, గంగయ్య, రమేశ్, ఆనంద్ పాల్గొన్నారు.

బోథ్: సొనాల మండలంలోని శ్రీరాజరాజేశ్వర ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బిజ్జారి గంగారెడ్డిని సొనాల గ్రామస్తులు శుక్రవారం శాలువాతో సత్కరించారు. ఆలయ అభివృద్ధికి పాటు పడతానని ఆయన పేర్కొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

తలమడుగు: సైబర్‌నేరాపై అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం తలమడుగు బ్యాంకు పరిధిలోని చర్లపల్లి, ఝరి, తలమడుగు గ్రామాల్లో కళాజాత బృందంతో అవగాహన కల్పించారు,. రుణ ఖాతాల పునరుద్ధరణ, పంట రుణ పథకం ప్రయోజనలు, లాభాలను వివరించారు. మహిళా పొదుపు సంఘాలకు తక్కువ వడ్డీతో మహిళ సాధికారత పొదుపు, రుణ సౌకర్యం గురించి వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు ఎడవల్లి ఆంజనేయులు, ఎడవల్లి చిరంజీవి, మిరియాల విజయ్, ఫీల్డ్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ కీటకజనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మలేరియా నిర్మూలన కోసం వైద్యశాఖ కృషి చేస్తుందని పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం తెలిపారు. 2030 సంవత్సరం నాటికి మలేరియా నిర్మూలనకు కలిసి పనిచేస్తామంటూ నినాదాలు చేశారు. దోమలు కుట్టకుండా చూసుకుందాం.. మలేరియాను తరిమి కొడదామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ అసిస్టెంట్ సంతోష్, సూపర్‌వైజర్లు స్వర్ణలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తులను నమ్మొద్దు



వివరాలు నమోదు చేస్తున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని చెప్పే మధ్యవర్తులను నమ్మవద్దని బోథ్ ఎంపీడీవో రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ధన్నూర్(బి), బిర్లాగొంది, నాగాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలచే ఎంపిక చేయబడిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కలిసి పలు వివరాలను సేకరించారు. ప్రస్తుతం వారు నివసిస్తున్న ఇళ్లు, వ్యవసాయ భూమి వివరాలు, ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నియమ నిబంధలను వివరించారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు అందిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు శిరీష, నిరోషా, లక్ష్మి నారాయణ, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బేల: రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూం ఇళ్ల మంజూరిలో దళారులను నమ్మొద్దని ఎంపీడీవో మహేందర్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏకోరి, షంషాబాద్, కాప్సి(బి) గ్రామాల్లో పర్యటించి, ఇటీవల ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇళ్ల మంజూరుకు ఇచ్చిన జాబితా వివరాలను పరిశీలించారు. ఇంటి నిర్మాణానికి స్థలం ఉండడంతో పాటు గుడిసె, పెంకుటిల్లు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరవుతాయన్నారు. ఒక కుటుంబానికి చెందిన వారిలో ఒకరికే మంజూరికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతిపై ఆదిలాబాద్ అర్బన్ మండల స్థాయి అవగాహన సదస్సును శనివారం నిర్వహిస్తున్నట్లు అర్బన్ మండల తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు కలెక్టర్‌చౌక్‌లోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించే సదస్సుకు కలెక్టర్, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లుగా తెలిపారు. చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్బన్ మండల పరిధిలోని రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌కు బదులుగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తహసీల్దార్ ఎంఏ కలీమ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని సూర్య గార్డెన్‌లో భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సుకు రైతులు, ప్రజలు, రైతులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లాల్‌టెకిడి జగదంబ, సేవాలాల్ మహరాజ్ 18వ ఆలయ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహారాష్ట్రలోని పొరదేవీకి చెందిన బంజారా ధర్మగురు శేఖర్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, జాదవ్ శ్రీరాం నాయక్, ఆడే ప్రేమ్ మహరాజ్, పర్సురాంనాయక్, వసంత్‌రావ్‌నాయక్ పాల్గొన్నారు.